ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్టం 31.6 కనిష్టం 19.0



నిజామాబాద్
జిల్లా వార్తలు

5 గురువారం 1 ఫిబ్రవరి 2024

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

సుభాష్‌నగర్, జనవరి 31: నగరంలోని దుబ్బా, శ్రద్ధానంద్ గంజ్, సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని నగర టౌన్-2 ఏడీ తోట రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని మహేశ్వరీ భవన్, గౌడ్స్‌కాలనీ, గుమస్తాకాలనీ, దుబ్బా బైపాస్ రోడ్డు, ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బడ్జెట్‌పై భారీ ఆశలు





- లోక్‌సభలో నేడు మధ్యంతర బడ్జెట్
- ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల
- కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసుల ఆశలు
- కలగానే బోధన్-బాన్సువాడ-బీదర్ రైల్వేలైన్
- ఉమ్మడి జిల్లాలో రైల్వే సమస్యలపై కరుణించేనా?

కామారెడ్డి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పైనే ఉమ్మడి జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత లోక్‌సభకు చివరి సమావేశాలు కావడంతో కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాసులు కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. బడ్జెట్ సమావేశాలు ముగియగానే లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడి మరో నెలరోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున కేంద్రం ఎలాంటి బడ్జెట్ ప్రవేశపెడుతుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రాజెక్టులపై సమావేశంలో చర్చకు వచ్చేనా అని ఉమ్మడి జిల్లా వాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

రైల్వే డబ్లింగ్ పనులు ప్రారంభమెప్పుడు?

దశబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ముత్కెడ్-నిజామాబాద్-బాసర-కామారెడ్డి-హైదరాబాద్ వరకు రైల్వే డబ్లింగ్ లైన్‌కు గత ఐదునెలల కిందట కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. డబ్లింగ్ లైన్ వేసేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సైతం కేటాయించింది. మహారాష్ట్రలోని ముత్కెడ్ నుంచి నిజామాబాద్ బాసర-కామారెడ్డి- హైదరాబాద్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని డోన్ వరకు సుమారు 417 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ డబుల్ లైన్‌గా మార్చడానికి రూ.4600 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు మంజూరుచేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ డబ్లింగ్ లైన్‌కు కేంద్రం నిధులు మంజూరు చేసినప్పటికీ నిధులను విడుదల చేసి పనులు ప్రారంభిస్తే దశబ్దాల కల నెరవేరనుంది. ఈ డబ్లింగ్‌లైన్ పూర్తయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రైలు రాకపోకలు మరింత పెరుగుతాయి. రవాణా సౌకర్యం సైతం మెరుగుపడనుంది.

బాన్సువాడ-బోధన్-బీదర్ లైన్‌కు పచ్చజెండా ఊపేనా?

జిల్లాలో వెనకబడిన ప్రాంతమైన బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాలకు రైల్వే సదుపాయం కల్పించేందుకు గాను బాసర నుంచి బోధన్-బాన్సువాడ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ వరకు రైల్వేలైన్ వేయాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. బాన్సువాడ- బీదర్ మధ్య దూరం 140కి.మీలు. బాన్సువాడ-బోధన్-బీదర్ రైల్వేలైన్ మంజూరుకు కృషి చేస్తామని ఎన్నికల సమయంలో నేతలు హామీలు ఇస్తూవచ్చారు. కానీ లైన్ మంజూరుకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఇక్కడ ప్రజల దశబ్దాల కలను నెరవేర్చేందుకు ఏ ఒక్కరూ గట్టిగా ప్రయత్నించిన పాపాన పోలేదు. దీంతో ఈ రైల్వే లైన్ కలగానే మిగిలిపోతుంది. ఈ లైన్‌కోసం గతంలో సర్వేకూడా చేశారు. ఆ తర్వాత మరిచిపోయారు. అలాగే కరీంనగర్ నుంచి పిట్లం వరకు కేకేవై (కరీంనగర్- కామారెడ్డి-ఎల్లారెడ్డి) జాతీయ రహదారి నిర్మించాల్సి ఉంది. ఏళ్ల తరబడి ఈ జాతీయ రహదారి మంజూరైనప్పటికీ ఈ పనులకు నిధులు మంజూరుచేయడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు ఇస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.


వందేభారత్ వచ్చేనా ?

కామారెడ్డి-నిజామాబాద్-సిరిసిల్ల-మెదక్-సిద్దిపేట జిల్లాలకు చెందిన వేలాది మంది ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి దేశ వాణిజ్య రాజధాని ముంబాయి మధ్య దేవగిరి ఎక్స్‌ప్రెస్ నడుస్తుంది. నిత్యం వందలాది మంది ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రయణిస్తుంటారు. ఈ మార్గంలో వందేభారత్ రైలులు నడిపితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వం వందేభారత్ రైలు మంజూరు చేయాలని ఇక్కడి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అశోక్‌నగర్, నర్సన్నపల్లిలో ఆర్‌ఓబీ మంజూరయ్యేనా ?


జాతీయ రహదారిపై రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైల్వే బ్రిడ్జిలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలో అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదేమార్గం గుండా జిల్లా కలెక్టరేట్, ఎస్పీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ఉండడం, పాత బస్టాండ్, రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం కావడంతో రైళ్లు వచ్చిపోయే సమయంలో గేటు పడడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని ప్రతిపాదనలు సైతం తయారు చేశారు. దీనికి కేంద్రం ఈ బడ్జెట్‌లో ఆమోదించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా నర్సన్నపల్లి వద్ద జాతీయ రహదారిపై ఉన్న రైల్వే గేటు వద్ద ఆర్‌వోబీ లేదా అండర్ పాసింగ్ బ్రిడ్జి వేయాలని వాహనదారుల కోరుతున్నారు.





ఎమ్మెల్సీగా మహేశ్ కుమార్ ప్రమాణ స్వీకారం

- శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ జిల్లా నాయకులు



ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్

నిజామాబాద్ అర్బన్ జనవరి 31: శాసనమండలి సభ్యుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుకేందర్‌రెడ్డి చాంబర్‌లో మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీల సమక్షంలో మహేష్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయనకు జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మత్తు పదార్థాల నిరోధానికి కృషి చేయాలి : కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, జనవరి 31: యువత, విద్యార్థుల భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్ శింగనేవార్ అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని జిల్లాలో మాదక ద్రవ్యాల తయారీ, వాటి వినియోగం రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. మాదక ద్రవ్యాల వినియోగంవల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అల్ఫ్రోజోలం వినియోగంలో రాష్ట్రంలో మొదటి మూడు స్థానాల్లో ఉన్న జిల్లాలో నిజామాబాద్ ఒకటిగా ఉందని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. గంజాయి సాగుకు సంబంధించిన ఎలాంటి కేసులు నమోదు కాలేదని ఇతర ప్రాంతాల నుంచి గంజాయి రవాణా అవుతుందన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మందమకరంద్, అదనపు డీసీపీ జయరాం, ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రాజగౌడ్, వినోద్‌కుమార్, వ్యవసాయ అధికారి వాజిద్‌హుస్సేన్, ప్రసాద్, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి..

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు, రవాణా, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ శాఖల అధికారులు పాల్గొని రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ప్రమాదాల తీవ్రతపై సీపీ కల్మేశ్వర్ శింగనేవార్ మాట్లాడుతూ.. 20, 23 సంవత్సరంలో జిల్లాలో 767రోడ్డు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ప్రమదా ఘటనలు చోటు చేసుకున్నాయని 337 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. 203 తీవ్రంగా గాయపడ్డారని 2022లో 674ప్రమాదాల్లో 340మంది మరణించారన్నారు. అత్యధికంగా డిచ్‌పల్లి పోలీసుస్టేషన్లలో ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీ తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు





- అరకొర వసతులతో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ఇబ్బందులు
- రెండేళ్లుగా ప్రాక్టికల్స్ నిర్వహణకు రాని నిధులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 31: ఇంటర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు భారంగా మారాయి. గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా ప్రయో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రయోగ పరీక్షలపై ఇబ్బందులు లేకున్నా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు మాత్రం ప్రయోగ పరీక్షలంటేనే భయం పట్టుకుంది. ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మూడు విడతల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు గాను 55పరీక్ష కేంద్రాలను జనరల్ విద్యార్థులకు, 20పరీక్ష కేంద్రాలను ఒకేషనల్ విద్యార్థులకు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 17వేల 950మంది జనరల్ విద్యార్థులు, 2397మంది ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు, 1991మంది ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరు కాను న్నారు. ప్రయోగ పరీక్షలంటే వాటికి సంబంధించిన పరికరాలు, కెమికల్స్, ఇతరత్ర వస్తువులు అవసరం ఉంటాయి. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు కీలకం. కానీ ప్రభుత్వం గత నాలుగేళ్లగా ప్రాక్టికల్స్‌కు సంబంధించిన నిధులను విడుదల చేయకపోవడంతో ప్రాక్టికల్స్ తూతూ మంత్రంగానే నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి విద్యార్థులకు అధ్యాపకులు ముందుగానే సాధన చేయించాల్సి ఉండగా నేరుగా పరీక్షలప్పుడే విద్యార్థుల చేత ప్రాక్టికల్స్‌ను చేయిస్తున్నారు.

నిధులు రావాల్సి ఉంది..

: రఘురాజ్, డీఐఈవో

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి గత సంవత్సరం నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన నిధులు ఇంకా విడుదలకాలేదు. పరికరాలు, రసాయనాల కొనుగోలుకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అసౌకర్యాలు లేకుండా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

భారంగా మారిన నిర్వహణ..

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కీలకమైన ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు భారంగా మారింది. ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం కళాశాలలకు రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో పరీక్షల నిర్వహణ అంతంతమాత్రంగానే సాగుతోంది. ఇంటర్‌లో సైన్స్ విద్యార్థులకు థియరీతో పాటు ప్రాక్టికల్స్ చాలా ముఖ్యం. చదువుకున్న పాఠాన్ని ప్రాక్టికల్స్‌లో చేయాల్సి ఉంటుంది. ప్రైవేటు కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత నాలుగేళ్లగా ప్రాక్టికల్స్ నిర్వహణకు సంబంధించిన నిధులు విడుదలకాక పోవడంతో కళాశాలల్లో ఉన్న ల్యాబ్‌లలో అరకొర వసతులు, శిథిలావస్థలో ఉన్న ల్యాబ్‌లు, తుప్పు పట్టిన పరికరాలతోనే విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ యేడాది ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఇప్పటికి ఎలాంటి పరికరాలు కానీ, రసాయనాలు కాని కొనుగోలు చేయలేదు. పాత పరికరాలు, పాత రసాయనాలతోనే ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ సన్నద్ధమవుతుంది. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రైవేటు విద్యార్థులతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో తక్కువ మార్కులను సాధిస్తున్నారు.

పంచాయతీల్లో ఇకపై ప్రత్యేక పాలన





- గ్రామ పంచాయతీల్లో నేటితో ముగియనున్న సర్పంచ్‌ల పాలన
- రేపు పంచాయతీల వారీగా బాధ్యతలు చేపట్టనున్న అధికారులు
- పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చెందుతున్న సర్పంచ్‌లు
- జిల్లాలో మొత్తం 530 గ్రామ పంచాయతీలు

నిజామాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన గురువారంతో ముగియనుంది. సర్పంచ్‌ల ఐదేళ్ల పాలన ముగుస్తుండడంతో ప్రత్యేక అధికారులను నియమించేందుకు రంగం సిద్ధం చేశారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించేంత వరకు గ్రామాల్లో వీరి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగనుంది. ప్రజాసమస్యలు ప్రత్యేక అధికారి పాలనలోనే పరిష్కరించనున్నారు. గ్రామాల స్థాయిని బట్టి గెజిటెడ్ అధికారుల నుంచి నాన్ గెజిటెడ్ అధికారుల వరకు నియామకం చేయనున్నారు. పదవీకాలం ముగుస్తున్నా సర్పంచ్‌లు మాత్రం బకాయిలపై ఆందోళన చెందుతున్నారు. చేసిన పనులకు వెంటనే నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రేపటి నుంచి పంచాయతీల్లో అధికారుల పాలన

సర్పంచ్‌ల పదవీకాలం ఐదేళ్లు పూర్తవుతుండడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు మొగ్గుచూపింది. సర్పంచ్‌లకు ఎక్స్‌టెన్షన్ ఇవ్వకుండానే అధికారులను నియమిస్తున్నారు. జిల్లాలోని 530గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీలు, తండా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ పంచాయతీల పరిధిలో ఈజీయస్ కింద పలు అభివృద్ధి పనులను చేపట్టారు. గ్రామపంచాయతీల నూతన భవన నిర్మాణాలు, పల్లె ప్రకృతివనాలు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణ పనులు చేపట్టారు. ఈజీయస్‌తో పాటు ఇతర శాఖల నిధులు విడుదల చేస్తారని మైనర్ రోడ్డు పనులు, కాలనీ ల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. శాసనసభ ఎన్నికల ముం దు నుంచి గ్రామాల్లో చేసిన పనులకు నిధులు విడుదల కాలేదు. కేంద్రం కూడా ఈజీయస్ కింద చేపట్టిన పనులకు నిధులు విడుదల చేయలేదు. గ్రామపం చాయతీల పరిధిలో చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు 10కోట్ల వరకు ఉన్నాయి. ఈ పనులన్నీ ఈజీయస్ ద్వారా చేపట్టిన బిల్లులు రాక పదవీవిరమణ చేస్తున్న కొన్ని గ్రామాల సర్పంచ్‌లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇవేకాకుండా పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు వస్తాయని కొన్ని గ్రామాల్లో పనులు చేశారు. గత కొన్నినెలలుగా విడుదల కాకపోవడం వల్ల బిల్లులు చెల్లింపులు చేయలేదు. వాటికి సంబం ధించి కూడా పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. గురువారంతో సర్పంచ్‌లు పదవీ విరమణ చేస్తుండడంతో బిల్లు లపై ఆందోళనలో ఉన్నారు. అధికారులను కలుస్తూ బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నారు. పదవీ విరమణ తర్వాత పెండింగ్ బిల్లు లు విడుదల అవుతాయో లేవోనని ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది సర్పంచ్‌లు త్వరగా విడుదల చేయకపోతే ఆందోళనలకు దిగేందుకు సిద్ధమవుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు పూర్తిచేసినా ప్రారంభోత్సవాలు చేయ కుండానే పదవీవిరమణ చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం మారడం, కొత్త ఎమ్మెల్యేలు రావడంతో పాత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భవనాల నిర్మాణానికి వారు త్వరగా మొగ్గు చూపకపోవడం వల్ల చాలా గ్రామాల్లో సర్పంచ్‌లు భవనాలు నిర్మాణాలు చేసినా ప్రారంభోత్సవాలు చేయకుండానే పదవీ విరమణ చేయనున్నారు.

అధికారుల జాబితా సిద్ధం

జిల్లాలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అన్నిగ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు జాబితాను సిద్ధం చేశారు. గురువారం సాయంత్రం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులను జారీచేయనున్నారు. ఇప్పటికే ఆయా మండలాల పరిధిలో పనిచేస్తున్న అధికారుల జాబితాను సిద్ధం చేసిన జిల్లా అధికారులు ఆ మండలాల్లోనే గ్రామాల్లో ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు సిద్ధమవుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీలకు మండలాల్లో పనిచేస్తున్న ఇరిగేషన్, సాగునీటిశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులను నియమించేందుకు సిద్ధమయ్యారు. మైనర్, తండా పంచాయతీలకు నాన్‌గెజిటెడ్ అధికారులను నియమించనున్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖతోపాటు విద్యాశాఖ అధికారులను నియమించనున్నారు. ముఖ్యమైన శాఖల సిబ్బందిలేనిచోట పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లను కూడా నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ కీతో పాటు ఇతర సామగ్రిని గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఉంచనున్నారు. చెక్‌పవర్ పంచాయతీ కార్యదర్శితో పాటు ప్రత్యేక అధికారికి ఇవ్వనున్నారు. వీరిద్దరి ఆధ్వర్యంలోనే నిధులు ఖర్చు చేయనున్నారు. ప్రత్యేక అధికారుల పాలన కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ తెలిపారు. నేటి సాయంత్రం ప్రత్యేక అధికారులను నియమిస్తామని, వారు రేపటి నుంచి విధుల్లో ఉంటారని ఆమె తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే పట్టణాల అభివృద్ధి : తూము పద్మ

బోధన్ రూరల్, జనవరి 31 : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పట్టణాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ నెల వారి సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వార్డులు చేసిన అభివృద్ధిని కౌన్సిలర్లకు వివరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ 28 ఏజెండా అంశాలకు మున్సిపల్ తీర్మానం చేసిందన్నారు. ఇందులో మున్సిపల్ డీఈ శివానందం, కౌన్సిలర్లు శ్రీకాంత్‌గౌడ్, పిట్ల సత్యం, డప్పు, అబ్దుల్ జావీద్, అబ్దుల్లా, హబీబ్‌ఖాన్, చిన్న, దూప్‌సింగ్, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

బోధన్ రూరల్, జనవరి 31: సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్‌తో పాటు సొసైటీ డైరెక్టర్లు, ఎంపీటీసీతో పాటు పలువురు బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరామన్నారు. ఆయన వెంట సొసైటీ డైరెక్టర్లు కన్నె రమేష్, లింబయ్య, ఎంపీటీసీ కన్నెల సవిత, మాజీ ఉప సర్పంచ్ డిస్కో సాయిలు తదితరులు ఉన్నారు.

రెంజల్: మండల కేంద్రానికి చెందిన మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ రమేష్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకుడు సాయా గౌడ్ బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సర్పంచ్ రమేష్ కుమార్ తెలిపారు. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యుడు నర్సయ్య, ప్రవీణ్, ప్రభాకర్‌లు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఇందులో మండల అధ్యక్షుడు మొబీన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, అంతిరెడ్డి రాజిరెడ్డి, సాయి రెడ్డి, హన్మంత్ రావు, శ్రీనివాస్, సురేష్‌పటేల్, తదితరులు ఉన్నారు.

'ఇనుము ధరల పెరుగుదలను నియంత్రించాలి'

పెద్దబజార్, జనవరి 31: ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంట్ ధరల పెరుగుదలను నియంత్రించాలని తెలంగాణా బిల్డింగ్ నిర్మాణ రంగం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్‌జహాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏసీఎల్ కార్యాలయంలో కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ కార్మిక చట్టాల సవరణ ఆపాలని ప్రైవేటీకరణను నిర్మించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణాలకు కావలసిన ముడిసరుకు ధరలను పెంచడం వల్ల సామాన్యులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించేందుకు కృషి చేయాలని తెలిపారు. అంతేకాకుండా నిర్మాణ కార్మికుడు ప్రమాదంలో మృతి చెందితే ఇచ్చే సహాయాన్ని 6లక్షల నుంచి 10లక్షల వరకు పెంచాలని అన్నారు. ఖాళీగా ఉన్నటువంటి ఏసీఎల్, డీసీఎల్ ఏఎల్‌వో, జూనియర్ సీనియర్ అసిస్టెంటెంట్ వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ యూనియన్ నాయకులు కృష్ణ, శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

4న ప్రతిభ కళాశాల ప్రవేశ పరీక్ష

● ఆర్సీవో అలివేలు

డిచ్‌పల్లి, జనవరి 31: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియేట్ ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష సీవోఈ సెట్ 2024 ఈ నెల 4న (ఆదివారం) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రవేశ పరీక్ష ఎంపిక చేయబడిన కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని ప్రాంతీయ సమన్వయకర్త అలివేలు, ప్రిన్సిపాల్ సంగీతలు ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈ పరీక్ష టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ధర్మారం(బి), కంజర, ఆర్మూర్, సుద్దపల్లి, పోచంపాడ్, నవీపేట, కామారెడ్డి జిలాల్లో టీఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్(జేసీ) ఎల్లారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, తాడ్వాయి, తాడ్కోల్, కోయగుట్ట, తక్కడపల్లి, పెద్ద కొడప్‌గల్, కామారెడ్డి డిగ్రీ కళాశాల,పెద్ద ఎక్లార, బాన్సువాడ (బోర్గాం), నిర్మల్ జిల్లాలో ముథోల్, లెఫ్ట్ పోచంపాడు, జామ్, కడెం, భైంసా, ఈ పరీక్ష నిర్వహించడబడుతుందని ప్రాంతీయ సమన్వకర్త అలివేలు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్‌లను అంతర్జాలం నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష సకాలంలో హాజరుకా వాలని, గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆర్సీవో సూచించారు. పరీక్ష ప్యాడు, బ్లూ,ఆర్ బ్లాక్ పెన్, వెంట తెచ్చుకోవాలని సూచించారు.



ఆరు గ్యారెంటీల అమలు ఎక్కడ!?

● మాజీ మంత్రి , బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి31: ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలే వ్యతిరేకిస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేములప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని ఎఎస్‌జీ గార్డెన్‌లో బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేస్తున్నది జోడో యాత్రకాదని, కాంగ్రెస్ జోడో యాత్రగా అభివర్ణించారు. ఒక వైపు రాహుల్ గాంధీ జోడో యాత్ర చేస్తుంటే మరో వైపు ఇండియా కూటమి నుంచి ఇతర పార్టీలు కాంగ్రెస్ జోడో యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని యాత్రలు చేసిన దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే హామీలు పూర్తిగా నెరవేరుతాయని సీఎం అనడం హామీల అమలు నుంచి పారిపోవడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న హామీలను పార్లమెంట్ ఎన్నికల లోపు అమలు చేయాలన్నారు. తెలంగాణ వనరులు దోపిడీకి గురవుతున్న వేళ అవిశ్రాంత పోరాటం చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిన నిలిపిన కేసీఆర్‌కు సరైన గౌరవం దగలేదన్న భావన ప్రజల్లో ఉందన్నారు. స్వల్ప ఓట్ల తేడాతో మాత్రమే ఓడిపోయామని, ప్రజలు తమను తిరస్కరించలేదని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల ఉంటుందని నమ్మకం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ధర్మబద్ధంగా నడలేదని, అబద్దాపు ప్రచారాలతో ప్రజలను నమ్మించారని అన్నారు. వారి అబద్దాపు ప్రచారాలను తాము పసిగట్టలేకపోయామన్నారు. అధికారంలోకి వచ్చిన కేవలం 50రోజుల్లో రూ.14వేల కోట్ల అప్పులు ఎందుకు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు, మాట్లాడిన వీడియోలయను స్క్రీన్‌పై ప్రదర్శించారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజలు లబ్ధిపొందాలి

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్ పాలనలో ప్రజలు లబ్ధిపొందాలని కార్యకర్తలు నిస్వార్థంగా పని చేశారని ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని, కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రైతుల ఆత్మహత్యలు తగ్గయన్నారు. 24గంటలు ఉచిత కరెంటు ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీల అమలుపై నిలదీస్తే సమాధానం చెప్పలేక ఆక్రోశంతో వ్యవహరిస్తున్నారని దుయ్యాబట్టారు. కాలేశ్వరంపై ఇష్టరీతిలో తప్పుడు ప్రచారం చేసి ప్రజలను నమ్మించారని రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ హయంలో ఉద్యోగాలు ఇవ్వలేదని, తప్పుడు ప్రచారం చేశారని, రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించింది బీఆర్ఎస్ ప్రభుత్వమైతే కాంగ్రెస్ వాళ్ల తామే ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మధుశేఖర్, కోటపాటి నర్సింహంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పోచారం కుటుంబం నుంచి తెలంగాణ తిరుమలకు విముక్తి కల్పించాలి


ఎండోమెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీఎమ్మెల్యే యెండల

నిజామాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోచారం కుటుంబ నుంచితెలంగాణతిరుమలకు విముక్తికల్పించాలని మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గల తెలంగాణ తిరుమల దేవాలయానికి అన్ని తామే అన్నట్లుగా పోచారం కుటుంబం వ్యవహరించడాన్ని ఆయన తప్పుపడుతున్నామన్నారు. తన కుటుంబసభ్యులను శాశ్వత ట్రస్ట్‌లుగా నియమించుకోవడాన్ని అందుకోసం గత ప్రభుత్వం జారీచేసిన జీవోలను రద్దుచేసి వెంటనే ఆ దేవాలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రత్యేక అధికారిని లేదా ఎగ్జిక్యూటివ్ అధికారిని వెంటనే నియమించి ఆలయ పరిరక్షణకు,ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా నిధులు, ఆలయ కార్యక్రమాలు జరిగేలాగా దేవాదాయశాఖ పూర్తి బాధ్యతలను తీసుకునేలా ప్రత్యేక జీవో రూపొందించి ధర్మకర్తలుగా ఉన్న పోచారం కుటుంబ సభ్యులను తొలగించాలని ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌కు హైదరాబాద్‌లో ఆయన వినతి పత్రం అందించారు.

రేకులపల్లిలో వేములపల్లి కిరణ్ వర్ధంతి

ధర్పల్లి, జనవరి31: మండలంలోని రేకులపల్లి గ్రామంలో ప్రగతి శీల యువజన సంఘం జిల్లా టెలికన్వీనర్ కామ్రేడ్ వేములపల్లి కిరణ్‌కుమార్ 33వ వర్ధంతిని బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ చిత్రపటతానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి కారల్‌మార్క్ మాట్లాడుతూ కిరణ్‌కుమార్ చిన్నతనం నుంచే ఉద్యమాల వైపు ఆకర్షితుడై నూతన సమాజం ఏర్పడడానికి క్రియాశీల పాత్ర పోషించాడన్నారు. 23ఏళ్లలోనే జిల్లాలోని గ్రామ గ్రామానికి తిరిగి యువకులను ఏకతాటిపైకి తెచ్చ యువజన సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ మండల నాయకులు సాయికుమార్, జాగీర్, సాంబయ్య, శివరాజ, రాములు, నర్సాగౌడ్, గంగాధర్, దేవదాస్, గంగారాం, గంగాధర్, జగన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ కళాశాలలో వీడ్కోల సమావేశం

ముప్కాల్, జనవరి31: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ విద్యార్థులు బుధవారం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అర్గుల చిన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు వివరించారు. చదివిన కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించారు.ఈకార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన భృతిని ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలి

● తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 31:బీడీ పరిశ్రమలో పని చేస్తున్న రకాల క్యాటగిరీలకు చెందిన వారికి రూ.4000 జీవనభృతి ఎలాంటి ఆంక్ష లు లేకుండా ఇవ్వాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు భూమేశ్వర్, సూర్యశివాజీలు అన్నారు. బుధవారం నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గడచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి జీవోను తీసుకురాలేదు కాబట్టి కార్మికులు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి రాగానే జీవనభృతి ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని అన్నారు.జనవరి 30న రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి మెమోరండాం ఇవ్వడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు భూమన్న, శివకుమార్, గంగాధర్, సుప్రియ, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

మోస్రా,జనవరి31: మోస్రా మండలంలోని చే నెంబర్ తండాలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల ఎదుగుదల, బరువు కొలతలు పరిశీలించారు. ప్రతి సెంటర్‌లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికారులు ప్రతాప్, ఉమేష్, సీడీపీవో జానకి, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంబాబు,సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, జనవరి31: ఆర్మూర్ మండలం దేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో రాజగంగారాం, జెవీ.అనురాధ, ఎస్.శ్రీనివాసులను గ్రామస్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం సరోజ, ఎంపీటీసీ అనుష శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్ గడ్డం గంగారెడ్డి, హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ సంఘ భవనానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్, జనవరి31: ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో బుధవారం గ్రామ మహిళా సంఘ భవనం మరమ్మతు పనులకు సర్పంచ్ గడ్డం సరోజ గంగారెడ్డి భూమిపూజ చేశారు. మహిళ భవనం మరమ్మతులకు ఎంపీ ల్యాండ్ నిధులు రూ.4లక్షలు ఎంపీ ధర్మపురి అర్వింద్ మంజూరు చేశారు. నిధులు మంజూరు చేసి ఎంపీ అర్వింద్, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీటీసీ మణిదీపిక, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

● ఒలంపిక్ సంఘ అధ్యక్షుడు ఈగసంజీవరెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 31 :క్రీడా సంఘాలను కలుపుకుని క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆర్చరీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఈగసంజీ వరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఒలంపిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఈగసంజీవరెడ్డిని ఒలంపిక్ సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. అనంతరం ఈగసంజీవరెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులకు చేయూత నిస్తూ క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేద్దా మన్నారు..ఈకార్యక్రమంలో ఒలంపిక్ సంఘ కార్యదర్శి బొబ్బిలి నర్స య్య, కోశాధికారి భూమరెడ్డి,ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి,సంయుక్త కార్యదర్శులు విజయ్‌కాంత్, రాజగౌడ్,అబ్దుల్ ఉమర్, కార్యవర్గ సభ్యులు యాసిన్, మనోజ్‌కుమార్, సురేష్, జావెద్,సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరోనో కష్టకాలంలో సర్పంచ్‌ల సేవలు మరువలేనివి :ఎంపీపీ

బోధన్ రూరల్, జనవరి 31: కరోనా మహమ్మరీ వంటి కష్ట కాలంలో సర్పంచ్‌లు గ్రామస్థులకు చేసిన సేవలు మరువలేనివని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ అన్నారు. బుధవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌ల పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగా రెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీగిర్దావర్ గంగారెడ్డి,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శ్రీని వాస్ రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు జయశ్రీ భూమారెడ్డి, పంచా యతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు సురేష్, పంచాయితీ ఏఈ సాయిలు, ఎంపీడీవో పర్బన్న, ఎంపీవో మధుకర్‌లతో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో నారాయణ విద్యార్థులు

పెర్కిట్, జనవరి31: ఆర్మూర్ పట్టణంలోని నారాయణ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రిషీ ఆత్రేయ, నిఖిల్ చంద్ర విద్యార్థులు అండర్-14 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు రజనీకుమారీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 16నుంచి 18వ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి ఫిబ్రవరి 3వ తేదీన జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనడం పట్ల విద్యార్థులను అభినందించారు. అదే విధంగా నారాయణ విద్యాసంస్థల తెలంగాణ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శివాజీ, పీఈటీలు రజీత మోహన్‌లు విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన మెడికల్ ఆఫీసర్

ముప్కాల్, జనవరి31: బాల్కొండ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం కాయకల్ప కార్యక్రమంలో భాగంగా గాంధారి మెడికల్ ఆఫీసర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గల వసతులు రోగులకు ఏలా అందుతున్నాయో పరిశీలించారు. ఆసుపత్రిలో నీటి వసతి, తగిన మందులు, ఎంత మంది సిబ్బంది ఉన్నారో అధ్యాయనం చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ వైద్యులు అనిల్ కుమార్, శృతి, రక్షిత, స్టాఫ్ నర్సు, ల్యాబ్ సిబ్బంది, పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ముప్కాల్, జనవరి31: బాల్కొండ మండల కేంద్రంలోని 1033 సర్వే నెంబర్ స్థలం కబ్జాకు గురైనట్టు తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గందం వెంక టేశ్వర్ స్థానిక తహసీల్దార్‌తో కలిసి సర్వేచేశారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థల సరిహద్దులను పరిశీలించారు. గురువారం నుంచి ఎండో మెంట్ సర్వే చేపడతామని డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గందం వెంక టేశ్వర్ తెలిపారు.



ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం : ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్,జనవరి31: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వీరన్నగుట్ట తండా, రెంజల్, సాటాపూర్, బోర్గాం, తాడ్‌బిలోలి, దండిగుట్ట, దూపల్లి గ్రామాలలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటి సారి మండలానికి రావడంతో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. వీరన్నగుట్ట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విద్యార్థులతో ముచ్చటించి పాఠశాలకు అవసరమైన సదుపాయల గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉందని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 7వ తరగతి చదువుతున్న వినయ్ అనే విద్యార్థి జన్మదినం ఉండడంతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖజనాను ఖాళీ చేసి అప్పుల రాష్ట్రంగా మార్చిందని, రాష్ట్ర విభజన తర్వాత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను 10సంవత్సరాలలో అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తే లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ ఇప్పటి వరకు అమలు చేస్తూ వస్తుందని మిగత పథకాలను త్వరలోనే అమలు చేస్తామన్నారు. రైతు శ్రేయసు కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని, గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించడానికి ఎంతగానో ఉపయోగపడిందని, ప్రాజెక్టులు కట్టిన పార్టీ కాంగ్రెస్‌పార్టీ అని, పేదల కోసం పాటుపడే పార్టీ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ప్రజలు 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు మోసపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తోందని అన్నారు. ప్రజల సమస్యల కోసం అధికారులు ప్రజా సమస్యలను స్వీకరించి పరిష్కార దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాములు, సాయారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ధనుంజయ్, అంతిరెడ్డి రాజిరెడ్డి, జావీదోద్దీన్, నితిన్, రెంజల్ సర్పంచ్ రమేష్ కుమార్, వీరన్నగుట్ట సర్పంచ్ రాజు, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ రాంచందర్, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ట్రస్మా ప్రతినిధులు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్‌అర్బన్, జనవరి 31: సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ట్రస్మా ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర అధికార ప్రతినిధి జయసింహాగౌడ్ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

పీజీ పరీక్షల్లో 51మంది విద్యార్థుల గైర్హాజరు



పీజీ పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్

డిచ్‌పల్లి, జనవరి 31:టీయూ పరిధిలో పీజీ 3,5,7,9వ సెమిస్టర్ రెగ్యులర్, 5వరోజు పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పీజీ పరీక్షల్లో 5వ రోజు 51మంది విద్యార్థులు గైర్హాజరయ్యాని ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, లా కళాశాల,సౌత్‌క్యాంపస్, ఆర్మూర్ డిగ్రీకళాశాల, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళా శాల, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని, బుధవారం ఉదయం జరిగిన పరీక్షకు 900మందిఅభ్యర్థులకు గాను 850 విద్యార్థులు హాజరయ్యారని, 50మంది గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 158మంది విద్యార్థులకు గాను 157 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఒకరు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 31: వాణిజ్య సముదాయ భవనంలో నడిపిస్తున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డీఈవో దుర్గాప్రసాద్‌కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లయోల మాతృశ్రీ పాఠశాలను వాణిజ్యసముదాయ భవనాల్లో నడిపిస్తున్నారని అన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం కమర్షియల్ బిల్డింగ్‌లో నడుప కూడదని ఉన్న రోడ్డు సైడ్ వాహనాల కాలుష్యం ద్వారా విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాఠశాల యాజమాన్యం కనీస నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. ప్లేగ్రౌండ్, క్వాలిఫైడ్ టీచర్లు లేరని అన్నారు. వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ నాణ్యమైన విద్య అందించకపోవడం సరికాదన్నారు. కమర్షియల్ బిల్డింగ్‌లో పాఠశాల నడుపుతున్న విద్యాశాఖాధికారులకు తెలిసిని పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయక కార్యదర్శి నవీన్‌కృష్ణ, నాయకులు భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లా సహకార బ్యాంకులో ఏకకాల పరిష్కార పథకం పొడిగింపు

సుభాష్‌నగర్, జనవరి 31 :జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఏకకాల పరిష్కార పథకంను పొడగిస్తున్నట్లు డీసీసీబి ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తెలిపారు. జనవరి31తేదీల్లో ఓటీఎస్ పథకం ముగుస్తున్నందున చాల మంది రుణగ్రహీతలు పాతరుణాల నుంచి విముక్తి పొందాల్సి ఉన్నందున పాలక వర్గ సమావేశంలో ఏకకాల పరిష్కారం పొడగించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఏకకాల పరిష్కార పథకం ఫిబ్రవరి1నుంచి మార్చి 1వరకు అమలుల్లో ఉంటుందన్నారు. 31-3-2023నాటికి కాలపరిమితి ముగిసిన బ్యాంకు ద్వారా బట్వాడ చేయబడి సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలపై అపరాధవడ్డీ వందశాతం మాఫీవాయిదా మీరిన వడ్డీపై 30శాతం మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. అదే తేదీ నాటికి కాలపరిమితి ముగిసిన బ్యాం కు నుంచి తీసుకున్న ఎన్ఎఫ్ఎస్ మార్టిగేజ్ ఎల్‌టీ లోన్ అగ్రికల్చర్ జేఎల్‌జీ ఎస్‌హెచ్‌జీ, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు రుణాలపై 32శాతం వడ్డీ మాఫీ చేయబడునని తెలిపారు. అర్హులైన రుణగ్రహీతులను ఓటిఎస్‌ను సద్వినియోగం చేసుకుని బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. మిగ తా వివరాల కోసం సంబంధిత సొసైటీలు బ్రాంచ్ మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

నేడు స్పెషల్ ఆఫీసర్ పాలనపై అవగాహన సదస్సు

రుద్రూరు,జనవరి 31: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రుద్రూరు మం డల సమీకృత కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు స్పెషల్ ఆఫీసర్ పాలనపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు. ఈ సదస్సుకు ప్రజాప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు సకాలంలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇందల్‌వాయి,జనవరి 31: రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థినులు మొదటి స్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత తెలిపారు. బీసీవెల్ఫేర్, మైనార్టీ రెసిడెన్సీయల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలచిన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందిం చారు. ఈపోటీలు ఆదిలాబాద్‌లోని ఉట్నూర్‌లో జనవరి16 నుంచి 21వరకు జరిగాయని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడకారులకు ట్రోఫీతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు.

ఇందిరమ్మ రాజ్యం దిశగా సీఎం పాలన

● అర్హులందరికీ సంక్షేమ ఫలాలు ● దేవుడి పేరుతో రాజకీయం తగదు
● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి



టీయూలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, జనవరి 31: కాంగ్రెస్ పార్టీ పేదలు, మహిళల పక్షపాతి అని, తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం దిశగా సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండలంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు. శ్రీనగర్‌లో డ్వాక్రా భవన్, శాస్త్రినగర్, మల్కాపూర్ (ఎ)లో గ్రామ పంచాయతీ భవనాలు ఆయ సర్పంచ్‌లు సురేందర్ రెడ్డి, శేఖర్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేను మీ పక్కఊరు గ్రామానికి చెందిన వ్యక్తిని, వైద్యవృత్తిని వదులుకొని ప్రజా సేవచేయడానికే వచ్చానను, రూరల్ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ సమస్యల వచ్చినా తన దృష్టికి తేవాలని అన్నారు. కేటీఆర్ ఓడిపోయినా అహంకారం తగ్గలేదని, కాంగ్రెస్ పార్టీపైన, సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని, అందుకు కొంత సమయం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. చెప్పింది చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ, 6గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని ఇదివరకే రెండు హామీలు నెరవేర్చామని ఎమ్మెల్యే తెలిపారు. మల్కాపూర్ (ఎ)లోని అసైన్డు భూమి అర్హులైన పేదలకు పంచుతామని హామీ ఇచ్చారు. దళిత బంధు, బీసీబంధు తదితర బంధ్‌లన్నీ బంద్ చేశామన్నారు. వాటికోసం ఎవరికైనా డబ్బులిస్తే వాటిని వసూలు చేసుకోవాలని సూచించారు. కొన్ని పార్టీలు రాముడి పేరుమీద ఓటుబ్యాంక్ రాజకీయాలు చేయడం శోచనీయమన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సురేందర్ రెడ్డి, శేఖర్‌గౌడ్, ఖనీస్‌బీ, ఎంపీటీసీ దొంతు శాంత, కాంగ్రెస్ నేతలు ముప్ప గంగారెడ్డి, దాసరి ఒడ్డెన్న, గొడ్డల్ల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు బీఆర్ఎస్ సర్పంచ్‌లు

నిజామాబాద్ రూరల్: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడానికి ఒక్క రోజు ముందు సర్పంచ్‌లు పార్టీ ఫిరాయించారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ లో చేరారు. బుధవారం రూరల్ మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. శ్రీనగర్‌లో మహిళాభవన్, శాస్త్రినగర్, మల్కాపూర్ (ఎ)లలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ఆయా సర్పంచ్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంనగర్ సర్పంచ్ హర్షియా సబ్రీత్ జిలానీ, శాస్త్రినగర్ సర్పంచ్ ఖనీసా బేగం, మల్కాపూర్ సర్పంచ్ కెతావత్ హరిచంద్ నాయక్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.తమకు పార్టీల కంటే గ్రామాల అభివృద్ధి ముఖ్యమని, ప్రజల అభీష్టం మేరకే తాము కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు. అభివృద్ధి పార్టీలకు అతీ తంగా అంతా కలిసి రావాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు.

● అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు, వీడీసీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.కల్యాణ మండపానికి కిచెన్ షెడ్డు, శివాలయానికి ప్రహరీ,మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని గ్రామ ఎంపీటీసీ సభ్యులు సవిత రామకృష్ణ, వీడీసీ సభ్యులు డా.లింబాద్రి, తేజా, జగదీశ్, రామ్‌చందర్, గణేశ్, రమేశ్, తదితరులు తెలిపారు. నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకు వీడీసీ సభ్యులుఘనంగా సన్మానించారు.

● ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం

మోపాల్: మండలంలోని న్యాలకల్‌లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి బుధవారం ప్రారంభించారు. 20లక్షలతో నిర్మించిన ఈ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కోరారు. అనంతరం గుడి తండాలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పాగంగారెడ్డి, గంగాప్రసాద్,కిరణ్,సతీష్‌రావ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● తెలంగాణ వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీకి వచ్చే ఆర్థిక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా కృషి చేస్తానని, ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కోరతానని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీవనశైలిని సులభతరం,సౌకర్యవంతంగామార్చుకోవడానికి గణిత శాస్త్రం సులభతరంగా ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌యాదగిరి ఎమ్మెల్యేకు వర్సిటీ అభివృద్ధిపై నివేదిక అందజేశారు.ఆదిలాబాద్, నిర్మల్, మెదక్ జిల్లాల కళాశాలలను వర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని, ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులను ఏర్పాటుకు సహకరించాలని రిజిస్ట్రార్ ఎమ్మెల్యేను కోరారు. బాలికల హాస్టల్ ఇరుకుగా మారిందని, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రిజిస్ట్రార్ కోరారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్, మినీ స్టేడియం, ఎస్ఎస్ఎస్, ఆడిట్ సెల్, అడ్మినిస్ట్రేషన్, బ్లాక్‌లకు నూతన భవనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకులంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యేను రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఆరతి, సీవోఈ అరుణ, అడిషనల్ కంట్రోలర్ నందిని, పీఆర్‌వో పున్నయ్యలు సన్మానించారు. గణితశాస్త్ర ప్రతిభ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన మొదటిసారి డా. భూపతిరెడ్డి తెలంగాణ యూనివర్సిటీని సందర్శించిన సమయంలో పాలకమండలి సభ్యులు కనీసం అటువైపు కన్నెతి చూడకపోవడంపై ఈసీ సభ్యులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యేకు వినతి

డిచ్‌పల్లి:గత పదేళ్లుగా తెలంగాణ యూనివర్సిటీలోని వివిధ డిపార్టుమెం ట్‌లలో పనిచేస్తున్న తామందరికి ఇంత వరకు ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చి ఇంత వరకు హామీ నేరావేర్చాలేదని టీయూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డిని కోరారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యేకు సిబ్బంది, ఉద్యోగులు వినతి పత్రం అందజేసి తమ గోడును వినిపించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, డాక్టర్ షాదుల్ల, రాజేశ్వర్, ఉన్నారు.

సిర్నాపల్లి సంస్థానాధీశురాలి విగ్రహావిష్కరణ



సిర్నాపల్లి సంస్థానాధీశురాలి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం, లైబ్రరీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఇందల్‌వాయి , జనవరి 31 :సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలంజానకిబాయి విగ్రహాన్ని బుధవారం సిర్నాపల్లి గడికోట ఆవరణలో ఆవిష్కరించారు. విగ్రహా ఆవిష్కరణ కార్యాక్రమానికి శీలంజానకిబాయి వంశస్తురాలు ఆమె మునిమనవరాలు అయిన అనురాధరెడ్డి, తహసీల్దార్ వెంకట్రావ్‌తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గతంలో సిర్నాపల్లి గ్రామానికి ఘనమైన చరిత్ర ఉండేదని సిర్నాపల్లి దొరసాని శీలంజానకిబాయి గడికోటలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని వంద గ్రామాలను ఇక్కడి నుంచే పరిపాలించేవారని గుర్తు చేశారు. ఆమె హయాంలో జిల్లాలో గొలుసుకట్టు చెరువులు ఎన్నో అద్భుత కట్టడాలను నిర్మించారన్నారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు రైలు మార్గాం వేసే సమయంలో రైలు మార్గాన్ని సిర్నాపల్లి గ్రామం మీదుగా తీసుకెళ్లిన ఘనత శీలంజానకీ బాయిదేనన్నారు. ఆమె వల్లే సిర్నాపల్లి గ్రామం ఎంతో చరిత్ర కలిగి ఉందని ఇప్పుడు చదువుకునే విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో సిర్నాపల్లి చరిత్రను లిఖించడం అభినందనీయమన్నారు. శీలంజానకీబాయి నిర్మించిన పెద్దచెరువుకు ఇటీవల రాష్ట్రం నులుమూలల నుంచి జలపాతాన్ని చూసేందుకు వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారని ఇలాంటి రాతి కట్టడాలు నిర్మించడంలో ఆమె కృషి ఉందన్నారు. ఆమె గడికోటలోని మొదటి అంతస్థులో విద్యార్థులు పాఠకుల సౌకర్యార్థం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచామని పాఠకులకు మొదటి అంతస్థులో చదువుకోవడానికి అనుకూలంగా ఉండేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచు విజయ్‌కుమార్ తెలిపారు. సిర్నాపల్లి సంస్థానాదీశురాలు శీలంజానకీబాయి గత చరిత్రే తమకు గర్వకారణమని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి మల్లేష్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళ సంఘాల సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ అశ్విని‌శ్రీనివాస్, ఉపసర్పంచ్ నవీన్‌గౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవీపేట,జనవరి31: నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన కొంత స్థలాన్ని పలువురు కబ్జాకు గురి చేస్తున్నారని ఆసుపత్రి సిబ్బంది బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు నిజామాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి పరిస్థితిని వివరించారు. ఆసుపత్రికి చెందిన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంపై ఆయన సానుకూలంగా స్పందించి కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మెడికల్ ఆఫీసర్ కావ్య, హెచ్‌ఈవో వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్లు దేవేందర్, కిషన్, ప్రభాకర్ తదితరులున్నారు.

సిద్దులగుట్టపై సీఐ ప్రత్యేక పూజలు

పెర్కిట్, జనవరి31: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై బుధవారం పట్టణ నూతన సీఐ రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన సీఐ రవికుమార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. సీఐ రవికుమార్ సిద్దులగుట్టపై గల అభివృద్ధికి ఆలయ కమిటీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, గంగాకిషన్, బోండ్ల ఆనంద్, లక్ష్మణ్, అయ్యప్ప శ్రీనివాస్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన ప్రత్యేక అధికారి

● నాలుగు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి ● పంచాయతీ ప్రత్యేక అధికారులకు దిశా నిర్దేశం

ధర్పల్లి, జనవరి31: మండలంలోని 22గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియామించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికా రులకు ఎంపీడీవో లక్ష్మణ్ దిశానిర్ధేశం చేశారు. బెలియ తండాకు ఇ.గంగాధర్(సీనియర్ అసిస్టెంట్), సల్లగారిగే సి.సుదాకర్ (జూనియర్ అసిస్టెంట్), దమ్మన్నపేట్ హరీష్‌కుమార్ (జూనియర్ అసిస్టెంట్), దానంబండతండా డి.రవి (ఎంఆర్ఐ), ధర్పల్లి కె.లక్ష్మణ్ (ఎంపీ డీవో), దుబ్బాక ప్రవీన్ (ఏవో), గోవింద్‌పల్లి రాంప్రసాద్ (ఏఈఈ ఇరిగేషన్), గుడి తండా శివకుమార్ (పీఏ), ఒన్నాజీపేట్ దామోదర్‌రావు (ఏఈఆర్‌డబ్ల్యుఎస్) ఇంద్రనగర్‌తండా లక్ష్మీప్రసన్న (ఏఈవో) బేషరాం మనోజ్‌కుమార్ (ఏఈవో), కోటర్‌పల్లి రవి (ఏఆర్ఐ), మగ్దుల్‌తండా లావణ్య(ఏఈవో), మైలారాం మాలతి (తహసీల్దార్), మరియతండా స్నేహలత(ఏఈవో), బోబిన్ సబ్ తండా ప్రవీన్‌కుమార్(డీటీ), నడిమితండా సుప్రియా (సర్వేయర్), రామడుగు రాజేష్ (ఎంపీవో), రేకులపల్లి భూమయ్య (ఏడబ్ల్యువో), ఎస్‌బీతండా బుజ్జి (ఐసీడీఎస్ సూపర్‌వైజర్), సీతాయిపేట్ ఎండి.అసీఫోద్దిన్ (డిప్యూటీ ఎఫ్ఆర్‌వో), వాడిరాజేందర్‌రెడ్డి (జూనియర్ అసిస్టెంట్), సీనియర్ అసిస్టెంట్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారులకు ఎంపీడీవో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అధికారులు చెట్ల పెంపకం, పారిశుధ్యం, ఇంటి పన్నులు బకాయి వసూళ్లు, తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. నియమితులైన ప్రత్యేక అధికారులు స్థానిక గ్రామపంచాయతీలో ఈనెల 2న బాధ్యతలను చేపట్టాలన్నారు.

చెరువులను పరిశీలించిన ఆర్డీవో



భీమ్‌గల్ పట్టణంలో చెరువులను పరిశీలిస్తున్న ఆర్డీవో వినోద్ కుమార్

భీమ్‌గల్ రూరల్, జనవరి31: భీమ్‌గల్ పట్టణంలోని రాధం చెరువు, ధర్మారాయుడు కుంట, బాబాపూర్ కుంటల చెరువుల భూములను బుధవారం ఆర్డీవో వినోద్ కుమార్ పరిశీలించారు. మండలంలోని చెరువులు కబ్జాకు గురి అయ్యాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు చెరువు భూములను పరిశీలించినట్లు తెలిపారు. గతంలో భీమ్‌గల్ పట్టణంలో తహసీల్దార్ గా చేసిన అనుభవం తనకు వుందని, చెరువుల భూములను కబ్జాచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. రాధం చెరువు కబ్జాకు గురిఅయ్యిందని కబ్జా భూమిలో గృహనిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు వచ్చాయని అతి తొందరలోనే సమగ్ర సర్వే చేసి కబ్జా చేసి నిర్మించిన గృహనిర్మాణాలను గుర్తించి కూల్చివేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్షత్రీయ కళాశాలలో ఈ వర్క్‌షాప్

ఆర్మూర్‌రూరల్, జనవరి31: ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళా శాలలో బుధవారం ఐసీటీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో సెల్స్ ఫోర్స్ టెక్నాలజీ, టూల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీటీ అకాడమి తెలంగాణ హెడ్ గోపాల్ మాట్లా డుతూ ఐసీటీ పరిజ్ఞానంతో సెల్స్‌ఫోర్స్‌కు సంబంధించిన ఉద్యోగాలు పొందవచ్చ న్నారు. ఉద్యోగాలు పొందే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన విద్యార్థులు మారుతున్న టెక్నాలజీల పట్ల అవగాహన పెంపొందించుకునేందుకు ఐసీటీ టెక్నాలజీ వంటి అంశాలపై వర్క్‌షాప్ ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, సునీల్, పాల్గొన్నారు.